క్లుప్తంగా

133 మందికి వైద్య పరీక్షలు



ఆరోగ్య జాగ్రత్తలను వివరిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ గౌరి

కె.కోటపాడు : వర్షా కాలం నేపథ్యంలో వేడి చేసి చల్లార్చిన నీటిని ప్రజలు తాగాలని లంకవాని పాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ సూచించారు. కొరువాడ జగన్నాథపురం గ్రామంలో మంగళవారం సంచార వైద్య చికిత్స శిబిరం నిర్వహించారు. 133 మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేశారు. గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్.వి.భాగ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ గౌరి, ఏఎన్‌ఎం సత్యవతి పాల్గొన్నారు.

గోతులను పూడ్పించిన తహసీల్దార్



బుచ్చెయ్యపేటలో రోడ్డు గోతులను పూడ్పిస్తున్న తహసీల్దార్ లక్ష్మి

బుచ్చెయ్యపేట: మండల కేంద్రం బుచ్చెయ్యపేటలో గోతులను తహసీల్దార్ లక్ష్మి దగ్గరుండి పూడ్పించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రధాన రోడ్లపై వరద నీరు నిలిచి పోగా గోతుల్లో చేరిన నీటితో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం తహసీల్దార్ జేసీబీతో గోతులను పూడ్పించి రాయి బుగ్గి వేసి బురద నీరు బయటకు పోయేలా చేశారు.

మురుగు కూపంలో రోలుగుంట



వర్షాలకు ఇళ్లలోకి చేరిన మురుగునీరు

రోలుగుంట: అల్పపీడన ప్రభావం మండల కేంద్రం రోలుగుంటపై పడింది. తాజాగా కురుస్తున్న వర్షాలకు పలు వీధులతో పాటు రహదారులు జలమయమయ్యాయి. మూడు రోజులుగా లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు పోయే మార్గం లేక మురుగు కూపంలోనే గడుపుతున్నారు. ఇంట్లో నుంచి బయటకు అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొంది. తీవ్ర దుర్గంధంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దోమ లు వ్యాప్తి చెంది కంటి మీద కునుకు లేకుండా పోయిందని బండారు వీధి, యాత వీధి, అల్లువారి వీధి, కండక్టర్ రాము ఇంటి పరిసర ప్రజలు వాపోతున్నారు. ఈ సమస్యకు వీధుల్లోని కాలువలో పూడిక తీత చేపట్టకపోవడమేనని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధి కారులు దృష్టి సారించి మురుగు సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎ.కోడూరు హైస్కూల్‌లో అదనపు భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు : ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో సమగ్ర శిక్షా నిధులతో నిర్మించిన అదనపు భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. ఆరు అదనపు తరగతి గదులను రూ.92.86 లక్షల నిధులతో నిర్మించారు. ఈ గదుల్లో లైబ్రరీ ఏర్పాటుతో పాటు పాఠశాల నిర్వహణకు మిగిలిన గదులను వినియోగించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు శేఖర్ తెలిపారు.

'రైవాడ'లోకి 3,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



వరదనీటితో కళకళలాడుతున్న జలాశయం

దేవరాపల్లి: భారీ వర్షాలతో రైవాడ జలాశయంలోకి వరదనీరు వచ్చి చేరుతోంది. సోమవారం జలాశయంలోకి 3,500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరువలో ఉంది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా.. ప్రస్తుతం 112.90 మీటర్లకు చేరుకుంది. ప్రమాదకర స్థాయి నీటిమట్టం 113.50 మీటర్లను ఏక్షణంలోనైనా చేరుకునే అవకాశం ఉంది. దీంతో స్పిల్వే గేట్లు ద్వారా శారదానదిలో నీరు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఇరిగేషన్ డీఈఈ సత్యంనాయుడు తెలిపారు. శారదానది పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, శారదానది దాటే ప్రయత్నం చేయవద్దని ఆయన సూచించారు.



మాడుగుల మండలం సత్యవరంలో మునిగిన వరి నాట్లు



కె.జె.పురంలో పెద్దచేరి గుండా పొలంలో నీట మునిగిన పంట పొలాలు



సాగరంలో నీట మునిగిన వరి పంటను చూపిస్తున్న రైతు సన్యాసినాయుడు



బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో వంతెనను ఆనుకుని ప్రవహిస్తున్న వరదనీరు

అన్నదాత.. తలాకుతలం

- రెండు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు
- నీట మునిగిన పంట పొలాలు
- ఆందోళనలో రైతులు



చెరువును తలపిస్తున్న ఎ.భీమవరంలో వరినాట్లు వేసిన పొలాలు



మాడుగుల మండలం ఎం.కోడూరులో మునిగిన వరి మొనలు చూపిస్తున్న రైతులు

మాడుగుల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరి మొనలు ముంపునకు గురయ్యాయి. మండలంలో వొమ్మలి, సాగరం, జేడీ పేట, సత్యవరం, జంపెన, ఎం.కోడూరు, కింతలి, వీజే పురం, గ్రామాల్లో వేసిన సుమారు 4 వేల ఎకరాల్లో వరి నాట్లు మునిగిపోయాయి. ఇంత వరకు వర్షాభావం కారణంగా ఈ ఏడాది ఖరీఫ్ వరి నాట్లు ఆలస్యమయ్యాయి. వారం రోజుల క్రితమే కొద్దిపాటి వర్షాలకు వరినాట్లు పడ్డాయి. ఈ క్రమంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వేసిన వరి మొనలు నీట పాలయ్యాయని అన్నదాతలు బోరుమంటున్నారు. కొండగెడ్డలతో పాటు, పెద్దేరు, తాచేరు, ఉరక గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. ఇకపై వర్షాలు కొనసాగితే ఖరీఫ్ వరినాట్లు కొట్టుకు పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

ముంపులో ఎం.కోడూరు గ్రామం

మండలంలో తారక రామ జలాశయం పంట కాలువలపై గొట్టాలు ఏర్పాటు చేయడంతో వరద నీటికి ఎం.కోడూరు గ్రామం ముంపునకు గురైంది. సోమవారం గొల్లపేటతో పాటు ఇతర వార్డులు నీట ముంపునకు గురయ్యాయి. దీంతో సర్పంచ్ గొళ్లవిల్లి సంజీవరావు స్పందించి పొక్లెయిన్‌తో కాలువలో చేరిన చెత్తను తొలగించి, నీటి ప్రవాహానికి మార్గం సుగమం చేశారు.

➡ ఎం.కోడూరులో సుమారు 150 ఎకరాల్లో వరి మొనలు ముంపునకు గురయ్యాయి. సుమారు మీటరు లోతులో వరి మొనలు నీటిలో ఉండి పోయాయి. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి ఉంటే మొనలు కుళ్లిపోయే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

మాడుగుల రూరల్: ఏటా రైతులను అతివృష్టి, అనావృష్టి వేధిస్తున్నాయి. అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న ఏకధాటి వర్షాలకు మండలంలో పలు గ్రామాల్లో వేసిన వరి పంట పూర్తిగా నీట మునిగింది. ఇటీవల వేసిన వరినాట్లుపై వర్షపు నీరు పొంగి ప్రవహిస్తుంది. పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. దీనికి తోడు తాచేరు, పెద్దేరు, శారదానది, పాలగెడ్డ, చింతగెడ్డ ఉధృతితో పంట పొలాల పైనుంచి నీరు పొంగి పొర్లుతోంది. కె.జె.పురం నుంచి ప్రధాన కూడలికి వెళ్లే రహదారి మీద నుంచి వర్షపు నీరు ప్రవహిస్తుంది.

కె.జె.పురం మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీసులు

వర్షాలకు విజయరామరాజుపేట వద్ద బొడ్డేరు నది మీద కాజ్‌వే కొట్టుకుపోవడంతో పాడేరు, మాడుగుల నుంచి విశాఖ, అనకాపల్లి వెళ్లే ఆర్టీసీ సర్వీసులు కె.జె.పురం మీదుగా నడుపుతున్నారు. విశాఖ డిపోకు చెందిన విశాఖ–పాడేరు, అనకాపల్లి నుంచి పాడేరు ఎక్స్‌ప్రెస్ బస్సులు కె.జె.పురం మీదుగా తిరుగుతున్నాయి. మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు ఈ రహదారిలో నిలిపివేశారు. పల్లె వెలుగు బస్సులు పూర్తి స్థాయిలో నడపకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



అధ్వానంగా తాండవ రిజర్వాయరుకు వెళ్లే రోడ్డు



ఎ.భీమవరంలో నీట మునిగిన వరి పంట

బుచ్చెయ్యపేటలో 13 సె.మీ. వర్షపాతం

బుచ్చెయ్యపేట: మండలంలో లోతట్టు ప్రాంతాలు, రోడ్లు, పంట పొలాలను వరద నీరు ముచ్చెత్తింది. సోమవారం ఒక్క రోజే 13 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదైంది. భీమునిపట్నం, నర్సీపట్నం(బీఎన్) ప్రధాన రోడ్డులో మేజర్ పంచాయతీ వడ్డాది పెద్దేరు నదిపై ఉన్న డైవర్షన్ రోడ్డు పూర్తిగా నీటిలో మునిగిపోయింది. విజయరామరాజుపేట తాచేరు నదిపై ఉన్న డైవర్షన్ రోడ్డు నీటి ఉధృతికి కోతకు గురై పూర్తిగా నీటిలో మునిగిపోయి దెబ్బతింది. వడ్డాది పెద్దేరు నదిపై శిథిల వంతెనను ఆనుకుని వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. విశాఖ, అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, పాడేరు వెళ్లే ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. బొడ్డేరు, తాచేరు, పెద్దేరు, గుర్రపు గెడ్డ నదులతో పాటు పలు గ్రామాల్లో వాగులు, గెడ్డలు నీటితో నిండుగా ప్రవహిస్తున్నాయి. లూలూరు, గంటికొర్లాం, చిన అప్పనపాలెం, పీడీ పాలెం, వడ్డాది, మంగళాపురం, కుముదాంపేట, విజయరామరాజుపేట తదితర గ్రామాల్లో ఉన్న వరి, చెరకు, మొక్కజొన్న, నువ్వులు, మినుము, పెసర తదితర పంటలు నీట మునిగాయి. వడ్డాదిలో శిథిలావస్థలో ఉన్న పశువుల ఆస్పత్రి భవనం పెంకులు రాలిపోయాయి. చోడవరం ఎమ్మెల్యే రాజు అధికారులు, నాయకులతో కలిసి కొట్టుకుపోయిన పేట తాచేరు డైవర్షన్ రోడ్డును, వడ్డాది డైవర్షన్ రోడ్డును, నీట మునిగిన పంటలను పరిశీలించారు.



కొరువాడ జగన్నాథపురంలో మునిగిన పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ సహాయకుడు

కె.కోటపాడు : మండలంలో పలు గ్రామాల్లో ఏకధాటిగా కురిసిన వర్షాలకు సాగునీటి చెరువులు నిండుకున్నాయి. వరినాట్లు వేసిన 15 రోజులకు ఎడతెరిపి లేకుండా వర్షాలు పడడంతో పొలాలు ముంపునకు గురయ్యాయి. ఎ.భీమవరం, గొండుపాలెం, రొంగలినాయుడుపాలెం, మురుగుపాలెం, పైడంపేట, మల్లంపాలెం, పాచిలవానిపాలెం, కొరువాడ జగన్నాథపురం గ్రామాల్లో ప్రస్తుతం ముంపులోనే వరి పొలాలు ఉన్నాయి.

నాతవరం: భారీ వర్షాలకు పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. మండలంలో 14 పంచాయతీల పరిధిలో ఏలేరు కాలువ నీరు ప్రవహిస్తుంది. దీంతో కాలువకు ఇరువైపుల ఉన్న పంట పొలాలు ముంపునకు గురయ్యాయని రైతులు వాపోయారు. రాజుపేట అగ్రహారం, లింగంపేట, నాయుడు పాలెం, ఎ.శరభవరం, మన్యపురట్ల యం.బి.పట్నం, గునుపూడి, చినగొలు, గొండపేట, ఉప్పరగూడెం, తదితర గ్రామాల్లో పొలాలు ఏలేరు కాలువ నీటి ఉధృతికి మునిగాయి. చాలా రోడ్లు బురదమయంగా మారాయి. తాండవ రిజర్వాయర్‌కు వెళ్లే రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. తుపాను ప్రభావంతో ఇంత వరకు ఎలాంటి నష్టం జరగలేదని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ తెలిపారు.



గొండుపాలెంలో ఉధృతంగా ప్రవహిస్తున్న మొండి గెడ్డ

కోతకు గురవుతున్న పెద్దేరు

మాడుగుల : పెద్దేరు నది సత్యవరం వద్ద కోతకు గురైంది. ఇప్పటికే సుమారు ఎకరాన్నర పొలం పెద్దేరులో కలిసి పోయిందని రైతులు నరసింహమూర్తి, అర్జున, సత్తిబాబు, కొంకోట సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దేరు పొంగినపుడల్లా తమ పొలాలు పెద్దేరులో కలిసి పోతుందని వాపోతున్నారు. అధికారులు స్పందించి రక్షణ గోడ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

కల్యాణపులోవ రిజర్వాయర్ పరిశీలన

రావికమతం: చీమలపాడు పంచాయతీ కల్యాణపులోవ రిజర్వాయర్‌ను సోమవారం కలెక్టర్ ఆదేశాల మేరకు రావికమతం మండల తహసీల్దార్ అంబేడ్కర్, ఎంపీడీవో సీతారామస్వామి, సర్వేయర్ శ్రీనివాసరావు, రిజర్వాయర్ ఏఈ సూర్య పరిశీలించారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటి మట్టం 460 అడుగులు కాగా, ప్రస్తుత నీటి మట్టం 451.2 అడుగులు ఉందని అధికారులు తెలిపారు. పంట పొలాలు ప్రస్తుతం ముంపునకు గురి కాలేదని చెప్పారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

మాడుగుల రూరల్: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు దృష్ట్యా స్థానిక తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు కె.రమాదేవి తెలిపారు. సోమవారం సాయంత్రం ఆమె విలేకరులతో మాట్లాడారు. పెద్దేరు జలాశయం పరిసరాల్లో గత రెండు రోజులుగా 144 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని చెప్పారు. పెద్దేరు, తారకరామ జలాశయాలను పరిశీలించి, తాజా పరిస్థితులపై అధికారులతో మాట్లాడామన్నారు. పెద్దేరు, తారకరామ జలాశయం పరివాహక గ్రామాలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ప్రతి గ్రామంలో వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వర్షాలకు తాటిపర్తి గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలికల పాఠశాల ప్రహరీ కూలిపోయిందని, ఎటువంటి ప్రమాదం జరగలేదని తహశీల్దారు పేర్కొన్నారు.

పొలాల్లో చేపల వేట



నర్సీపట్నంలో విద్యుత్ లైన్లు పునరుద్ధరిస్తున్న సిబ్బంది

నర్సీపట్నం: వర్షాలకు నర్సీపట్నం మున్సిపాలిటీ జలమయమైంది. జనజీవనం స్తంభించింది. నర్సీపట్నం –చింతపల్లి వెళ్లే ప్రధాన రోడ్డుకు అడ్డంగా పీనారపాలెం వద్ద చింతచెట్టు విరిగి పడింది. విద్యుత్, అగ్నిమాపక, పోలీసులు సంయక్తంగా పని చేసి చెట్టును తొలగించారు. యథావిధంగా వాహన రాకపోకలు సాగాయి. టౌన్ ఏఈ మనోజ్‌కుమార్, సిబ్బంది విరిగిన స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని వేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. బ్యాంక్ కాలనీలో భారీగా వర్షపు నీరు చేరడంతో చెరువును తలపించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నర్సీపట్నం పెద్ద చెరువు ఉప్పొంగింది. పొర్లుకట్టు మీదగా వరదనీరు ప్రవహించింది. చెరువులోని చేపలు వరద నీటితో పొలాల్లోకి కొట్టుకువచ్చాయి. వీటిని పట్టుకునేందుకు గుంపులు గుంపులుగా జనం తరలివచ్చారు.



చెరువును తలపిస్తున్న నర్సీపట్నంలో బ్యాంక్ కాలనీ



పొలాల్లో చేపలు పడుతున్న జనం

అయ్యా పింఛన్ పునరుద్ధరించండి



దివ్యాంగుడైన కుమారుడిని తీసుకుని వస్తున్న తల్లి వరలక్ష్మి

నర్సీపట్నం: సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వివిధ సమస్యలకు సంబంధించి 11 అర్జీలు అందాయని ఆర్డీవో వి.వి.రమణ తెలిపారు. అర్జీదారుల నుండి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు.

➡ నాతవరం మండలం అనంతపద్మనాభపురానికి చెందిన కొత్వాల వరలక్ష్మి పుట్టకతో దివ్యాంగుడైన తన కుమారుడి పింఛన్‌ను పునరుద్ధరించాలని ఆర్డీవోను వేడుకుంది. 2010లో సదరం క్యాంపులో వైద్యులు పరీక్షించి 83 శాతం అంగవైకల్యం కలిగినట్టు సర్టిఫికెట్ ఇచ్చారని ఆమె తెలిపారు. ఆ సర్టిఫికెట్ ఆధారంగా దివ్యాంగుల పింఛన్ పొందుతున్నాడని, వెరిఫికేషన్ పేరుతో ఇటీవల తన కుమారుడి పింఛన్ నిలిపి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాళ్లరిగేలా ఎంపీడీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని, మీరైనా తన కుమారుడి పరిస్థితి చూసి పింఛన్ పునరుద్ధరించి ఆదుకోవాలని వరలక్ష్మి ఆర్డీవోకు మొర పెట్టుకుంది.



వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో వి.వి.రమణ

➡ రెల్లి కులస్తుడైన తాను కుల ధ్రువీకరణ పత్రం రెన్యూవల్ చేయించుకునేందుకు సచివాలయానికి వెళ్లి ఆధార్ నంబరు నమోదు చేస్తే ఓసీ కులం అని చూపిస్తుందని రోలుగుంట మండలం రత్నంపేట గ్రామానికి చెందిన వి.నారాయణరావు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు.

➡ సాగులో ఉన్న తన భూమి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరుతూ కోటవురట్ల మండలం, లింగాపురానికి చెందిన కొల్లి యర్రయ్యమ్మ అర్జీ అందజేశారు.

➡ తనకు బడికి వెళ్తున్న ఇద్దరు పిల్లలు ఉన్నారని, ఒకరికి మాత్రమే తల్లికి వందనం డబ్బులు పడ్డాయని కోటవురట్ల మండలం రామచంద్రపాలేనికి లాలం అమ్మాజీ ఫిర్యాదు చేశారు. ఎక్కువగా భూసమస్యలు వచ్చాయి.

సచివాలయంలో అందని సేవలు

మాకవరపాలెం: సచివాలయంలో పూర్తిస్థాయి సిబ్బంది లేక ప్రజలకు సక్రమంగా సేవలు అందడం లేదు. మండల కేంద్రం మాకవరపాలెంలో ఉన్న సచివాలయంలో ప్రస్తుతం కార్యదర్శి, ఏఎన్‌ఎం, మహిళా పోలీస్, అగ్రికల్చర్ అసిస్టెంట్, వీఆర్వో ఉన్నారు. కీలకమైన డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల జరిగిన బదిలీల్లో ఈ పోస్టులు ఖాళీ అయ్యాయి. వారి స్థానంలో కొత్త వారిని నియమించలేదు. దీంతో వివిధ పనుల మీద వచ్చే గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాలకు సంబంధించి సేవలు సక్రమంగా అందడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. డిజిటల్ అసిస్టెంట్ బాధ్యతను మహిళా పోలీస్ అదనపు బాధ్యతగా చేస్తున్నా సంక్షేమ పథకాలకు సంబంధించి దరఖాస్తుదారులకు చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.



డిజిటల్ అసిస్టెంట్ బాధ్యతను నిర్వర్తిస్తున్న మహిళా పోలీస్

పునరావాస ప్యాకేజీ పెంచాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నక్కపల్లి మండల భూనిర్వాసితులు

నర్సీపట్నం: నక్కపల్లి మండలం వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ భూనిర్వాసితులు పునరావాస ప్యాకేజీని పెంపుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నిర్వాసితులైన రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, చందవాడ, అమలాపురం, డీఎల్.పురం గ్రామాల భూనిర్వాసితులు ఆందోళన బాటపట్టారు. ఇల్లు కోల్పోయిన కుటుంబాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఐదు సెంట్లు ఇంటి స్థలం, రూ.8,98,000 ప్యాకేజీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ ప్యాకేజీ ఎంత మాత్రం తమకు ఆమోదయోగ్యం కాదన్నారు. 2013లో వచ్చిన భూ సేకరణ చట్టంలో రూ.5 లక్షలు ప్యాకేజీ ప్రకటించిందన్నారు. ఈ చట్టం వచ్చి నేటికి 12 ఏళ్లు అవుతుందన్నారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు పెరిగాయన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.25 లక్షలు ప్యాకేజీ ప్రకటించాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. అలాగే 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు కూడా ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో వి.వి.రమణకు వినతిపత్రం అందజేశారు.

మేలుకొలుపు బృందానికి సాయం

రోలుగుంట: బుచ్చింపేట గ్రామానికి చెందిన మేలుకొలుపు బృందానికి అదే గ్రామానికి చెందిన వార్డు కార్యదర్శి ఆనిమిడ్డి రమణ సోమవారం రూ.2 వేలు తన సొంత నగదును మైకు ఏర్పాటు కోసం అందజేశారు. ఈ బృందం సభ్యులు ప్రతి సోమవారం భజన గీతాలు ఆలపిస్తుంటారు. ఈ కార్యక్రమాలకు మైకు అవసరాన్ని గుర్తించిన వార్డు కార్యదర్శి రూ.2 వేలు అందజేసి తన ఉదారతను చాటుకున్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

మాడుగుల: మండలంలో మంగళవారం నుంచి 23వ తేదీ వరకు, 28 నుంచి 30వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు జరగనున్నాయని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఆధార్ క్యాంపులు నిర్వహిస్తారన్నారు. ఆధార్ నమోదుతో పాటు తప్పులు దొర్లితే సరి చేసుకోవాలని కోరారు. 19, 20, 21 22 తేదీల్లో అవురువాడ, కేజేపురం, ముకుందపురం, కింతలి, 23, 28వ తేదీల్లో వీవీ అగ్రహారం, జేడీపేట, 29, 30న పోతనపూడి, వొమ్మలి గ్రామాల్లో ఆధార్ క్యాంపులు జరుగుతాయని ఎంపీడీవో తెలిపారు.

లోతట్టు ప్రాంతాల్లో అధికారుల పర్యటన

మాకవరపాలెం: మండలంలో మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో సోమవారం తహసీల్దార్ వెంకటరమణ, ఇన్‌చార్జ్ ఎంపీడీవో మేరీజోన్స్ తాడపాల, బూరుగుపాలెం, తూటిపాల, రాచపల్లి, జంగాలపల్లి, పి.పి.అగ్రహారం ప్రాంతాల్లో పర్యటించారు. సర్పానదితో పాటు తూటిపాల వద్దగల జాజిగెడ్డను పరిశీలించారు. మండలంలో ఎక్కడా తుపాను కారణంగా ఎలాంటి నష్టం వాటిల్లలేదన్నారు. సిబ్బందిని అప్రమత్తం చేశామని, ఎక్కడ ఇబ్బందులున్నా తమకు సమాచారం ఇవ్వాలని ఆదేశించామన్నారు. మూడు రోజులుగా 101.4 ఎంఎం వర్షపాతం నమోదు కాగా.. ఆదివారం ఒక్కరోజే 96.4 ఎంఎం నమోదైందన్నారు.



తూటిపాల జాజిగెడ్డ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో

రైతులను ఆదుకోవాలి

బుచ్చెయ్యపేట: మండలంలో వర్షానికి దెబ్బతిన్న రోడ్లను వెంటనే బాగు చేయించి పంట దెబ్బతిన్న రైతులను తక్షణం ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వడ్డాది, విజయరామరాజుపేట గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను, నీట మునిగిన డైవర్షన్ రోడ్లను వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, ఎంపీటీసీ కోరుకొండ లీలావతి, రమణ తదితర్లు పరిశీలించారు. అధిక వర్షంతో పలు గ్రామాల్లో వరి, చెరకు, మొక్కజొన్న, మినుము, పెసర, తదితర పంటలు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. పంట నష్టం జరిగిన రైతులను వెంటనే గుర్తించి పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. వరదలు వల్ల పేట, వడ్డాది డైవర్షన్ రోడ్లను బాగు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు గుమ్మిడి ప్రసాద్, అడపా వరహాలబాబు, బేతి వరలక్ష్మి, సయ్యపురెడ్డి కొండబాబు, నాగ, తురాయి మనోహర్, వంగల అప్పారావు, అడపా సత్తిబాబు, తెప్పల నాగేష్ పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు